## అందుబాటులో ఉండి సేవచేస్తా



సలీంనగర్ కాలనీలో అసోసియేషన్ సభ్యులతో బీఆర్‌ఎస్ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి

మలక్‌పేట, నవంబర్ 1 : ఆదరించి గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవచేస్తానని బీఆర్‌ఎస్ మలక్‌పే అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మూసారాంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్ కాలనీలో అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమలవుతున్న పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలు పరుస్తున్నాయన్నారు. రైతుబంధు పథకానికి ఐక్యరాజ్య సమితి ప్రశంసలు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు చంద్రశేఖర్, హనుమంత్ రావు, సామ్యేల్, మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిందితుడిపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం అందజేస్తున్న యాకుత్‌పుర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్, నవంబర్ 1 : బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడికి పాల్పడ్డ నిందితుడిపై చర్యలు తీసుకోవాలని యాకుత్‌పుర నియోజకవర్గం బీఆర్‌ఎస్ మ్మెల్యే అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి బుధవారం సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త ప్రభాకర్ రెడ్డిపై కుట్రపూరితంగా కత్తితో దాడిచేయడం దారుణమన్నారు. దాడిచేసిన వ్యక్తిని, ఇందులో ప్రమేయం ఉన్నవారిని గు ర్తించి చర్యలు తీసుకోవాలని న కోరారు. కార్యక్రమం లో ఐఎస్ సదన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, ఐఎస్ సదన్, కుర్మగూడ, సంతోష్‌నగర్, గౌలిపుర, డబీర్‌పుర డివిజన్ల బీఆర్‌ఎస్ అధ్యక్షులు మెట్టు భా స్కర్ రెడ్డి, దర్శనం నర్సింగ్ రావు, చింతల శ్రీనివాస్, బోధు సాయిబాబు, అజాజ్, రజా అలీ మిర్జా పాల్గొన్నారు.

# పరేషాన్‌లో.. ప్యారాచూట్ అభ్యర్థి

సైదాబాద్, నవంబర్ 1 : మలక్‌పేట అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థికి స్థానిక నాయకులు సెగ చూపిస్తున్నారు. నియోజకవర్గంతో సంబంధంలేని వ్యక్తిని, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పరిచయంలేని రియల్టర్‌కు పార్టీ టికెట్ కట్టబెట్టి, ఇప్పుడు ఎలా గెలుస్తారంటూ స్థానిక నాయకులు ప్రశ్నిస్తున్నారు. నామినేషన్ దాఖలు చేయక ముందే అభ్యర్థికి నాయకుల మధ్య నమన్వయం లేకపోవటంతో కాంగ్రెస్ నాయకుల మధ్య వర్గ విభేదాలు బగ్గుమంటున్నాయి. ఎన్నో ఏండ్లు డివిజన్ స్థాయిలో పట్టున్న తమను పట్టించు కోవటంలేదని సీనియర్లు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్యారాచూట్ నాయకులకు ఎమ్మెల్యే టికెట్‌ను ఇవ్వటంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో రహస్య సమావేశాలను నిర్వహిస్తుండటంతో కొందరు అలిగి అటువైపు వెళ్లలేక వారి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మలక్‌పేట కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

### సహకరించకపోవటంతో గందరగోళ ం..

నియోజకవర్గం పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించకపోవటంతో గందరగోళ వాతావరణం నెలకొన్నది. పార్టీ అధిష్టానం అనూహ్యంగా కొత్త వ్యక్తికి టికెట్ కేటాయించి, టికెట్ ఆశిస్తున్న వారి ఆశలపై నీళ్లు చల్లి, స్థానికేతురుడికి టికెట్ ఇవ్వటంతో ఆశావహులంతా అవాక్కు అయ్యారు.ఇతర ప్రాంతానికి చెందిన రియల్టర్ వచ్చి స్థానికంగా పోటీ చేస్తుండటంతో నాయకులు, కార్యకర్తలందరూ అసంతృప్తితో ఉన్నారు. తమకు సరైన ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఇవ్వటంలేదంటూ అతని ప్రవర్తన పట్ల వ్యతిరేఖ భావనతో ఉన్నారు. రియల్ ఎస్టేట్ బిజినెస్ వ్యవహారంలాగా క్యాడర్‌ను చూస్తున్నాడని, తమ సీనియార్టీని గుర్తించటంలేదంటూ మధన పడుతున్నారు. అలిగిన వారిని బుజ్జగింపులు చేస్తున్నప్పటికీ ఎవ్వరికీ కూడా ఆత్మసైర్థ్యం కల్పించక పోవటంతో వారందరూ అంతర్గతంగా అసంతృప్తితో ఉన్నారు. టికెట్ వచ్చినప్పటి నుంచి నియోజకవర్గ పరిధిలో తిరుగుతూ సీనియర్ నాయకులు, కార్యకర్తలను బుజ్జగించే పనిలోని నిమగ్నమయ్యాడు.

### అభ్యర్థిని అడ్డుకున్న స్థానికులు..

కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో దిగి క్షేత్రస్థాయిలో ప్రచారం చేయటానికి ప్రయత్నాలు చేస్తుండగా అక్బర్ బాగ్ డివిజన్ పరిధిలో ఓ కాలనీలో స్థానికులు అడ్డుకున్నారు. మరోసారి తమ ప్రాంతానికి వస్తే సహించేదిలేదని తేల్చిచెప్పారు. మా బస్తీలో ప్రచారం చేస్తే మూల్యం చెల్లించటానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించి అక్కడి నుంచి పంపించి వేసినట్లు సమాచారం. స్థానికులతోపాటు అదే పార్టీకి చెందిన అసమ్మతి నాయకులు వారికి పరోక్షంగా మద్దతు తెలుపటంతో అభ్యర్థికి చమటలు పట్టించటంతో అక్కడి నుంచి వెనుదిరుగక తప్పలేదు.

# రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ



యాకుత్‌పుర రిటర్నింగ్ ఆఫీస్

సైదాబాద్, నవంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానమైన నామినేషన్ల ప్రకియ శుక్రవారం నుంచి మొదలుకానున్నది. యాకుత్‌పుర నియోజకవర్గం-68 ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే వారందరూ చంపాపేట రహదారిపై ఉన్న సైదాబాద్ మండల కార్యాలయ ఆవరణలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంటుంది. గతంలో యాకుత్‌పుర నియోజకవర్గం రిటర్నింగ్ కార్యాలయం పాతనగరంలోని జీహెచ్ఎంసీ ఆఫీస్‌లో ఉండేది. ఈసారి సైదాబాద్ మండల కార్యాలయం ఆవరణలో యాకుత్‌పుర ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్లను దాఖలు చేయవచ్చును. నామినేషన్ వేయటానికి వచ్చే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతి ఇస్తారు. ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే తమ వాహనాలను నిలిపివేయాలి.

### అభ్యర్థులు పాటించాల్సిన అంశాలు

ఎన్నికల్లో పోటీ చేసే ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులకు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వర్గాలకు చెందిన వారు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ ఫాంలో ఉన్న అన్ని వివరాల ప్రకారం అభ్యర్థులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జతచేసి నామినేషన్ దాఖలు చేయాలి. నామినేషన్ వేసే ప్రతి అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతాను తెరువాల్సి ఉంటుందని, ప్రతి రోజు వ్యయాలను పరిశీలకులకు ప్రచార ఖర్చులను తెలియజేయాలి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుందని, ఇండిపెండెంట్ అభ్యర్థులైతే 10 మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది. అభ్యర్థులను ప్రతిపాదించే వారి పేరు ఓటరు లిస్ట్ జాబితాలో ఉండాలి. వారినే ప్రతిపాదించేందుకు ఎంపిక చేసుకోవాలి.

# టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ కార్యవర్గం ఎన్నిక



టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ముజీబ్‌హుస్సేనీని సన్మానిస్తున్న టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ నూతన కార్యవర్గం

సుల్తాన్‌బజార్, నవంబర్ 1: టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. బుధవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా శాఖ ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర వ్యవహరించారు. టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ అధ్యక్షుడిగా జీవీ రమణారెడ్డి, ఉపా ధ్యక్షులుగా సీహెచ్ సంజీవరెడ్డి, కార్యదర్శిగా ఆర్.జగదీశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఎ.రామ్ కుమార్, ఎం.ప్రణయ్, కోశాధికారిగా ఆర్.రఘురాం కుమార్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా ఆజ్మీరా రాంబాబు, మహ్మద్ అబ్దుల్ సలీం, కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ అబ్దుల్ ము క్తధర్, జే సాయివర్ధన్, మహమ్మద్ రహీం, జి.భాగ్యలక్ష్మి, బి.వెంకటేశ్వర్లు,కే నిరంజన్‌రెడ్డి, మహమ్మద సజావుద్దీన్, సి.మల్లేశ్ ఎన్నికైనట్లు వారు వివరించారు.

## కురుమల అభ్యున్నతికి కృషి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, సంఘం నాయకులు

అబిడ్స్, నవంబర్ 1 : కురుమల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. బుధవారం ముస్లింజంగ్ వంతెన వద్ద కురుమ సంఘం భవనంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి నారాయణ, ఉపాధ్యక్షుడు రెక్కాల కొండల్‌రాజు, కార్యదర్శి ఎక్కాల కన్నా, కోశాధికారి కట్ట మల్లేశం, ట్రస్ట్ బోర్డు సభ్యులు రేవల్లి ప్రకాశ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. యెగ్గె మల్లేశం మాట్లాడుతూ.. ఏపీ కురుమ సంఘం ప్రధాన కార్యదర్శినని చీలంపల్లి రమేశ్‌కుమార్ 11 కేసులను వేయగా చివరి కేసులో కూడా ఓడి పోయారని తెలిపారు. పదేండ్ల క్రితం ఏపీ కురుమ సంఘం, తెలంగాణ కురుమ సంఘం వేరు అని తీర్మానం చేసి తెలంగాణ కురుమ సంఘానికి ఎన్నికలు నిర్వహించడం జరిగిందని, అదే విధంగా రెండోసారి కూడా ఎన్నికలు నిర్వహించినట్లు వివరించారు. రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారి నారాయణ, రెక్కాల కొండల్ రాజు మాట్లాడుతూ.. కురుమ సంఘాన్ని భ్రష్టు పట్టించిన చీలంపల్లి రమేశ్ కుమార్ సంఘంతో ఆయనకు ఎలాంటి సంబంధం లేకున్నా కేసులు వేసి పరాజితులయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో బన్నె బుచ్చప్ప పాల్గొన్నారు.

# లిస్టులో పేరులేని వారిని ఓటు వేసేందుకు అనుమతించం




ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి



శిక్షణ తరగతులకు హాజరైన ఎన్నికల సిబ్బంది

మలక్‌పేట, నవంబర్ 1 : ఓటరు లిస్టులో పేరులేని వారిని ఓటు వేసేందుకు అనుమతించమని మలక్‌పేట ఆర్ఓ కె.వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నేపథ్యాన్ని పురస్కరించుకొని బుధవారం మూసారాంబాగ్ డివిజన్‌లోని శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియంలో ఓపీఓ (అదర్ పోలింగ్ ఆఫీసర్స్)లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ.. ఓటరు లిస్టులో పేరు ఉండి, ఎన్నికల సంఘం ఆమోదించే గుర్తింపు కార్డుతో వచ్చే వారికే ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. పోలింగ్ కేంద్రంలోకి రాగానే లిస్టులో పేరు ఉందో లేదో పరిశీలించాలని, ఓటరు లిస్టులో పేరు ఉంటే ఆ పేరును లిస్టులో రౌండప్ చేసి, దేని ఆధారంగా ఓటు వేసేందుకు వచ్చాడో పరిశీలించి దానిపై టిక్ చేసుకోవాలని, ఆ తర్వాతే అతనికి ఓటు వేసే అవకాశం కల్పించాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఓటు వేసిన వెంటనే ఓటరు చేతివేలిపై సిరా మార్కును వేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని, అదే సమయంలో సరైన ఆధారాలతో ఓటువేసేందుకు వచ్చిన ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఓటు వేసేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీసీ జయంత్, పీఓ యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మాదన్నపేట కూరగాయల మార్కెట్ ధరలు



| కూరగాయలు | కిలో రూ. | కూరగాయలు | కిలో రూ. |
|---|---|---|---|
| ఆలుగడ్డ | 20 | సొరకాయ | 10 |
| టమాట | 24 | క్యాబేజ్ | 12 |
| వంకాయలు | 30 | క్యారట్ | 35 |
| బెండకాయ | 20 | క్యాలీఫ్లవర్ | 20 |
| మిర్చి | 50 | దొండ | 16 |
| గోకరకాయ | 30 | కీర | 20 |
| చిక్కుడు | 50 | దోసకాయ | 16 |
| బిన్నీస్ | 60 | క్యాప్సికమ్ | 35 |
| బీరకాయ | 20 | బీట్‌రూట్ | 20 |
| కాకరకాయ | 20 | | |

ఈ ధరలు నేటి ఉదయం 9.30గంటల వరకు కూరగాయల మార్కెట్‌లో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు